

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత
జిల్లాలోని పారిశుధ్య కార్మికుల ఆరోగ్యభద్రతకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహకాలు
ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఎస్‌సీసీఎఫ్‌సీ వైస్ చైర్మన్ చిన్నరాముడు తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	26
తిరుపతి	38	27
తిరుమల	34	23
గూడూరు	40	29
నగరి	39	27

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌కు మంగళవారం పలు విద్యుత్ పరికరాలు వచ్చాయని నిర్మాణ విభాగం ఈఈ దామోదర్ తెలిపారు. 16 ట్రాన్స్‌ఫార్మర్లు (160 కేవీ), 2వేల మీటర్లు, 40 ట్రాన్స్‌ఫార్మర్లు (16 కేవీ) వచ్చాయని వివరించారు. ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ తీసుకోవచ్చని సూచించారు.

రిజిస్ట్రేషన్లకు సర్వర్ డౌన్



చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారులు

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడ సెంట్రల్ సర్వర్‌లో సమస్య రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్య ఏర్పడింది. సోమవారం సర్వర్ డౌన్ కావడంతో పలువురు మంగళవారం రిజిస్ట్రేషన్ పెట్టుకున్నారు. కానీ సాంకేతిక సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండోరోజూ అవస్థలు పడ్డారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. అప్పుడప్పుడు వెబ్‌సైట్ పని చేయడంతో కొద్దిపాటి రిజిస్ట్రేషన్లు మాత్రం జిల్లాలో జరిగినట్లు అధికారులు తెలిపారు.

32ఏ కింద రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రివర్స్ ప్రింటింగ్ రావడం లేదని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా 32ఏ ఫారమ్‌లో అమ్మకపు, కొనుగోలుదారులు ఫొటోలు అతికించి సంతకాలు సేకరించాలని ఆదేశించారు. అలాగే టీఐ రిజిస్ట్రార్‌లో వేలిముద్రలు తీసుకోవాలన్నారు. సర్వర్ పని చేసే వరకు ఈ విధానంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ)ల్లో బోధనా సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 20 కేజీబీవీల్లో ఒప్పంద (కాంట్రాక్ట్) పద్ధతిలో ఏడాది పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్- 3, పీజీటీ-61, సీఆర్టీ-31, పీఈటీ -3 పోస్టులన భర్తీ చేయనున్నట్లు వివరించారు. దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో 18-42, ఎస్సీ, ఎస్టీ బీసీలకు 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు 30, దివ్యాంగులకు 10 ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు apkgbv. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ మహమూద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పలమనేరు కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారని, రాష్ట్రంలోని ఏ పాలిటెక్నిక్‌లో చేరాలన్నా ఇక్కడి నుంచే అడ్మిషన్లు ఇస్తున్నట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎస్‌సీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, సివిల్, ఎలక్ట్రికల్, సీసీపీ తదితర కోర్సులను ఉచితంగా అభ్యసించే వెసులుబాటు కల్పించినట్లు వివరించారు. పాలిటెక్నిక్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తాజాగా నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 49 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,071 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చినట్లు వెల్లడించారు.

నేడు బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి బుధవారం బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ ఉంటుందని చెప్పారు. రెండేళ్లు పూర్తయినవారు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. వివిధ సబ్జెక్టులలో 21 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. నలుగురు టీచర్లకు పోస్టింగ్ ఇచ్చినట్లు వివరించారు.

4 వసంతాల పండగ



వైఎస్ జగన్ అనే నేను.. నాలుగేళ్లుగా ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది. పేదల పక్షపాత ప్రభుత్వంలో అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి పరుగులు తీస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా మారింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఊరూరా భారీ కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. అదే స్ఫూర్తితో ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతామని నినదించారు. రాబోయే సార్వత్రిక సమరంలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తామని ప్రతినబూనారు.



నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- కేక్‌లు కట్‌చేసి పండగ చేసుకున్న నేతలు
- చంద్రబాబు మేనిఫెస్టోపై విమర్శల బాణాలు
- బూటకపు హామీలు ప్రజలు నమ్మరని హితవు

సాక్షి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను కొనియాడారు. పుంగనూరు నియోజకవర్గం సదుంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర గృహనిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, ఎమ్మెల్సీ భరత్, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తదితరలు పాల్గొన్నారు. తిరుపతిలోని ఇందిరామైదానంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కేట్‌కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్వేటి నగరంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో కేట్ కట్‌చేశారు. గూడూరులో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శాంతినగర్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



సంబరాల్లో భాగంగా తిరుపతిలో బెలూన్లు వదులుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మేయర్, అధికారులు

వెన్నుపోటు..చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నారాయణవనం: నమ్మిన.. నమ్ముకున్న వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం. రామారావు గాలితో గెలిచిన వాండరూ ఆయనకే ద్రోహం చేసి, డబ్బులకు అమ్ముడుపోయి చంద్రబాబు వెనుక ఉన్నారని, వీరందరూ నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. నారాయణవనం వైఎస్సార్ సర్కిల్ వద్ద సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులతో కలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి స్వాగతం పలికారు. జగనన్న పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం కేక్ కట్‌చేసి డెప్యూటీ సీఎం కి తినిపించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గతంలో ఇంటికొక ఉద్యోగం, పేదలకు సాగుపొలం, నిరుద్యోగ భృతి అంటూ వివిధ హామీలిచ్చి ప్రలోభపెట్టారని, నేడు అదే హామీలతో మళ్లీ బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తే కోర్టుల నుంచి స్టేలు తెచ్చి అడ్డుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఒక న్యాయం, పెత్తందారులకు, ఆయన వర్గానికి ఒక న్యాయమా..?అని ప్రశ్నించారు. పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు అన్నాదొరై, కోనేటి బాబు పాల్గొన్నారు.

నవశకానికి నాంది



కేక్ కట్ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేడుకలో ఆయన పాల్గొని.. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. నవరత్నాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. టీడీపీ మోసపూరిత హామీలను ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు. అంతకు ముందు నేతాజీ, వైఎస్సార్ విగ్రహాలకు మంత్రి నివాళులర్పించారు. వైఎస్సార్, సీఎం వైఎస్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి పాల్గొన్నారు.



చిత్తూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



నారాయణవనంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



శ్రీకాళహస్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

మోసపూరిత హామీలు నమ్మరు బాబు!

తిరుపతి మంగళం : అధికార దాహంతో నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పడం.. మోసం చేయడమే చంద్రబాబు నైజమని, వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురుద్దేశంతో మోసపూరిత హామీలు, మేనిఫెస్టోలు తెచ్చినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా మంగళవారం తుడా సర్కిల్లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో వందలాది మోసపూరిత వాగ్దానాలు చేసి వంద పేజీల మేనిఫెస్టోను విడుదల చేసి చంద్రబాబు అధికారంలోకి రాగానే గాలికొదిలేశారని, అందుకే చంద్రబాబును రాష్ట్ర ప్రజలు 2019 ఎన్నికల్లో వెనక్కి నెట్టారని తెలిపారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా జగనన్న నవరత్నాలను చూసి మరో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏమి నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణమాఫీ, నిరుద్యోగ భృతి.. ఇలా చెప్పిన వాటిలో ఏ ఒక్కటైనా నెరవేర్చావా చంద్రబాబు అని ప్రశ్నించారు. పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు సీఎం జగనన్న అని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో పేదల సంక్షేమం కోసం రూ.3.4 లక్షల కోట్లను కేటాయించారని చెప్పారు. పేదప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు, గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్

పేదలంటే చంద్రబాబుకు చులకన

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం : పేదలంటే చంద్రబాబుకు చులకన అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బూరగమంద క్రాస్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు పేదలు గుర్తుకువస్తారని, తర్వాత వారిని పట్టించుకోకపోవడం ఆయన నైజమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పుట్రాజు పాల్గొన్నారు.

2 నుంచి 'పది' సప్లిమెంటరీ

- జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు
- పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలు మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నట్లు తెలిపారు. బుధవారం వాటిని జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పోలీస్ స్టేషన్లకు తరలించాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించే సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని నియమించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు.

28 కేంద్రాల్లో పరీక్షలు..

జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. 4,177 బాలురు, 2,808 బాలికలు మొత్తం 6,985 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, వైద్యాధికారి సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిర్మించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వేదికపై ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, నవాజ్‌బాషా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్

పుంగనూరు : చంద్రబాబు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులు నిర్మించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాజ్‌బాషా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని నేతిగుట్లపల్లె ప్రాజెక్టు వద్ద నిర్వహించిన రైతు సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజలకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులను టీడీపీ నేతలు తప్పుడు కేసులు వేసి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు ద్వారా నిమ్మనపల్లె, పుంగనూరు, వాయల్పాడు మండలాల్లోని సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఆవులపల్లె ప్రాజెక్టు ద్వారా చంద్రగిరి మండలంతోపాటు పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు నీరు అందుతుందని వెల్లడించారు. ఎప్పుడో జమీందారుల కాలంలో నిర్మించిన చెరువులు తప్ప పడమటి నియోజకవర్గాల్లో ఎలాంటి ప్రాజెక్టులు లేవన్నారు. అందుకే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.2వేల కోట్లు మంజూరు చేయించారని వివరించారు. ఈ దశలో చంద్రబాబు కుట్రపూరితంగా ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఒక్క ప్రాజెక్టును కూడా నిర్మించలేదని విమర్శించారు. తాత్కాలికంగా చంద్రబాబు అవాంతరాలు సృష్టించినా, అంతిమ విజయం తమదేనని స్పష్టం చేశారు. సమావేశంలో టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడిన ఐదుగురి అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

కుప్పం: కుప్పంలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, రూ.1.10 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసు స్టేషన్ స్టేషన్‌లో నిందితుల అరెస్టును చూపించారు. అనంతరం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం కలిగిన కుప్పంలో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజక వర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 50 మంది రౌడీషీటర్లు ఉన్నారని, ఇటీవల జరిగిన పలు అలజడులతో కుప్పంలో ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లిందన్నారు. రౌడీషీటర్లు ప్రవర్తనను మార్చుకోవాలని హెచ్చరించారు. తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా జరిగిన అలజడుల్లో 23 మందిపై కేసు లు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అర్బన్ సీఐ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

భారంగా కాదు.. బాధ్యతగా పనిచేద్దాం



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వేదికపై మంత్రి జోగి రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గృహనిర్మాణాలపై మంత్రి సమీక్ష

తిరుపతి అర్బన్: ఇంటి నిర్మాణాలు చేపట్టడంలో భారంగా కాకుండా బాధ్యతగా పనిచేద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, గృహనిర్మాణశాఖ రాష్ట్ర మంత్రి జోగిరమేష్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గూడు లేని పేదలందరికీ పక్కా గృహాలు అందించడం బృహత్తర కార్యక్రమంగా అభివర్ణించారు. అయితే ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ నేతలు గృహనిర్మాణాలపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ఇంటి నిర్మాణాలు చేపట్టడంలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తయితే కొత్త గ్రామాలు, కొత్త పట్టణాలు నిర్మించినట్టవుతుందని వెల్లడించారు. విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో జగనన్న కాలనీల్లో శరవేగంతో విద్యుత్ సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల దిగ్విజయంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూలై నాటికి 5 లక్షల ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలు చేపడుతామని చెప్పారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, చిత్తూరు ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, జంగాలపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చుతున్నారని, దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు అందించలేదన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ అభివృద్ధికి అడ్రస్ ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వెంకటగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం సాగుతోందన్నారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, చిత్తూరు మేయర్ అముద, గృహ నిర్మాణ శాఖస్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ లక్ష్మిషా, కలెక్టర్లు కే.వెంకటరమణారెడ్డి, షన్మోహన్, తిరుపతి డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, తిరుపతి కమిషనర్ హరిత, ఆర్డీవోలు, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాతృభాషకు మాండలికమే పట్టుగొమ్మ



మేఘనాథరెడ్డిని సత్కరిస్తున్న గంటామోహన్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : మాతృభాషకు మాండలికమే పట్టుగొమ్మ అని అధికార భాషాసంఘం సభ్యులు డాక్టర్ మస్తానమ్మ తెలిపారు. మంగళవారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గంటా కమలమ్మ కథా పురస్కార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మస్తానమ్మ మాట్లాడుతూసాహితీ రంగంలో యువత క్రియాశీలక పాత్ర పెరగాలని కోరారు. గ్రామిక జీవన సౌందర్యం, కుటుంబ బంధాలను ప్రతిబింబించే కథలు మరింతగా రావాలని ఆకాంక్షించారు. అరసం జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్ తన తల్లి పేరుతో సాహితీ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించడమ అభినందనీయమన్నారు. మేఘనాథ్ వెలువరించిన ×కలుంకూరి గుట్ట కథా సంపుటి చిత్తూరు మాండలికాన్ని, పల్లె జీవనాన్ని చాటిందని కొనియాడారు. ప్రముఖ అవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ సృష్టిలో అమ్మ ఒక అద్భుతమన్నారు. నేటి తరానికి మాతృభాష, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. గంటా మోహన్ సాహితీ రంగానికి విశేష సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాహిత్యాన్ని ఆదరిస్తున్న గంటా కమలమ్మ ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శాకం నాగరాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలకు పుస్తకాలు కథలు చదివే అలవాటు చేయాలని సూచించారు. రచయిత మేఘనాథ్ రెడ్డిని జ్ఞాపిక, రూ.10వేల బహుమతితో కమలమ్మ ట్రస్ట్ నిర్వాహకులు గంటా మోహన్, గంటా రాజా, గంటా రాజేంద్ర ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, ప్రముఖ రచయిత్రి ఎమ్మార్ అరుణ కుమారి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు తుల సీనాథం నాయుడు, సాహితీవేత్తలు పలమనేరు బాలాజీ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, ఎడ్ల బాలకష్ణారెడ్డి, యువశ్రీ మురళి, మునస్వామి, గిరిధరన్ ,బాలరాజు, చంద్రశేఖర్, మాధవీలత, రమేష్ బాబు, పురుషోత్తం, దేవరాజుల రెడ్డి,మోహన్, మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా సీజనల్ వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సాక్షి, చిత్తూరు : జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రాజశేఖర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ దిశగా గ్రామస్థాయిలో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శులకు సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గంలో సచివాలయ కార్యదర్శులతో మలేరియా అధికారి సమావేశం కావాలని స్పష్టం చేశారు. పురపాల పరిధిలో కమిషనర్లు సమావేశాలు చేపట్టాలని తెలిపారు. పట్టణ బస్టాండ్లలో ప్రతిరోజూ ఫాగింగ్ చేయించాలని సూచించారు. అటవీ ప్రాంత ప్రజలకు మలేరియా, డెంగీ పరీక్షలు చేయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో కూడా ప్రతి వారం ఫాగింగ్ తప్పనిసరని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా గర్భిణులు, బాలింతకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ ప్రకాశం, డీసీహెచ్ఎస్ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్, గిరిజన సంక్షేమ అధికారి ఏ.మూర్తి పాల్గొన్నారు.

మోస్ట్ వాల్యుబుల్ క్రికెటర్‌గా సిద్ధూ



ట్రోఫీతో సిద్ధూ

నగరి : మాస్టర్ క్రికెట్ క్లబ్ వారు చెన్నై స్టాగ్ మైదానంలో నిర్వహించిన అండర-14 క్రికెట్ టోర్నీలో నగరికి చెందిన సిద్ధూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. మోస్ట్ వాల్యుబుల్ క్రికెటర్ అవార్డు సాధించాడు. అవార్డు అందుకున్న సిద్ధూను మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం అభినందించారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహకాలు



రైతులతో మాట్లాడుతున్న చిన్నరాముడు

కుప్పంరూరల్ : ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు ఒక్కొక్కరికి రూ.9,500 విలువైన విత్తనాలు, పరికరాలను అందించనున్నట్లు ఏపీఎస్ సీఎఫ్‌ఫీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. మంగళవారం మండలంలోని చందం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనాల వల్ల భూసారం దెబ్బతింటుందని, ఆ పంటలను ఆహారంగా తీసుకుంటే అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. సేంద్రియా సాగుతో భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడి సైతం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా సంచాలకుడు నరసింహులు, సర్పంచ్ కుమారస్వామి పాల్గొన్నారు.

2న మెగా జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : యువతకు ఉపాధి కల్పించేందుకు జూన్ 2వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం నారాయణవణం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పదోతరగతి పాస్, ఫెయిల్, ఇంటర్, ఐటీఐ, ఇతర ఉన్నత కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు పాల్గొనవచ్చని సూచించారు. 15 బహుళ జాతీయ కంపెనీలలో దాదాపు 1,500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నట్లు వివరించారు. వివరాలకు 6300954441, 8374421195, 8121984014 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సెల్‌ఫోన్ గేమ్

- ఇనుపరాడ్డుతో వ్యక్తిపై దాడి
- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బాధితుడి మృతి
- పరారీలో నిందితుడు

పలమనేరు : పట్టణంలోని కోర్టు వద్ద నిర్మిస్తున్న భవనాల వద్ద సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. పశ్చిబంగాకు చెందిన కొన్ని కుటుంబాలు వారు భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిలో దయాళ్ సర్కార్(49), అతడి భార్య, కుమారుడితో మహ్మద్‌రోనీ ఇస్లాం (24) అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుకుంటూ చిన్నపాటి గొడవ పడ్డాడు. అక్కడితో ఆగకుండా పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో దయాళ్ సర్కార్ తలపై కొట్టాడు. భార్య, కుమారుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దయాళ్ సర్కార్ మంగళవారం మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో కేసు నమోదు చేయలేదు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన సైట్ సూపర్‌వైజర్ ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు హతుడి భార్య నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పురపాలక కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డీసీహెచ్ఎస్‌తో సమన్వయం చేసుకుని మెడికల్ క్యాంపులు నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు పారిశుద్ధ్య కార్మికుల పేర్లు, ఆధార్ నంబర్లతో జాబితా సిద్ధం చేసి పంపించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల అర్హత మేరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయించాలని కోరారు. జూన్ చివరి వారంలో రుణ మేళా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్మికులకు ఈఎస్ఐ, బీమా తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శేషగిరిరావు పాల్గొన్నారు.

జూన్ 30లోపు టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి

జిల్లా వ్యాప్తంగా జూన్ 30వ తేదీలోపు టిడ్కో ఇళ్ల నిర్మాణాల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై మొదటి వారంలో గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. అప్రోచ్ రోడ్లు, నీటి వసతి, ప్రహరి గోడల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైన రుణాలను బ్యాంకర్లతో ఇప్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో నగరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, పలమనేరు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

మోదీ బీసీ బిడ్డయితే.. కుల గణన చేపట్టాలి



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాసులు గౌడ్

- బీసీల సమానత్వం కోసం వైఎస్సార్‌సీపీ కృషి
- ఏపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసులుగౌడ్

చిత్తూరు రూరల్: ప్రధానమంత్రి బీసీ బిడ్డయితే.. బీసీల కుల గణన చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసులు గౌడ్ డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నూతన పార్లమెంట్ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. చట్టసభలకు నూతన నాయకత్వం రావాలంటే చట్ట సభలో 50 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు. 9 ఏళ్ల పాలనలో బీసీలకు మోదీ ఏంచేశారని ప్రశ్నించారు. బీసీల బిడ్డగా ప్రచారం చేస్తున్న ఆయన బీసీ గణన ఎందుకు చేపట్టడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే బీసీల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ.. సమానత్వం కోసం కృషి చేస్తోందని ఆయన కొనియాడారు. బీసీల గణన, చట్టసభలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో ఆగస్టు 7వ తేదీన తిరుపతిలో నిర్వహించే ఓబీసీల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రాయలసీమ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, నాయకులు సురేంద్ర, రంగ, వినోద్ గౌడ్, విజేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర

- జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి



మండీలో కాయల నాణ్యతను పరిశీలిస్తున్న దశరథరామిరెడ్డి

పుత్తూరు రూరల్: జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. మంగళవారం పుత్తూరు మార్కెట్ యార్డులో మామిడి ధరలను పరిశీలించారు. మండీ యజమానులు, రైతులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండీ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రించినా, రైతుల నుంచి కమీషన్లు వసూలు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యాక్టరీలు కొనుగోలు చేసే తోతాపురి రకం మామిడికి టన్ను రూ.19వేలుగా కలెక్టర్ నిర్ణయించారన్నారు. అయితే మండీ యజమానులు రూ.10వేలకే కొనుగోలు చేస్తుండడంతో ఫ్యాక్టరీల యాజమాన్యాలు కూడా రైతులకు నిర్ణీత ధర చెల్లిచడం లేదని వివరించారు. కనీసం రూ.14 వేల నుంచి రూ.15వేల వరకు టన్నుకు చెల్లించాలని ఆదేశించారు. అన్ని మార్కెట్ యార్డులను సందర్శించి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో చర్చించి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటి వరకు మండీ యజమానులు సహకరించాలని కోరారు. మార్కెట్ యార్డుల్లో రైతుల నుంచి కమీషన్లు వసూలు చేయకుండా యార్డు సెక్రటరీ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే రైతులు కూడా పక్వానికి రాకుండా కాయలను కోయడం మంచిది కాదన్నారు. జూన్ మూడో వారం నుంచి కోతలు ప్రారంభించాలని సూచించారు. విజయవాడ, కృష్ణగిరి, నూజివీడు ప్రాంతాల నుంచి మామిడి కాయలు వస్తున్న కారణంగా ఇక్కడ ధరలు తగ్గిపోతున్నాయని వెల్లడించారు. అనంతరం పుత్తూరు, నారాయణవనంలోని టాసా, లియోన్ జ్యూస్ ఫ్యాక్టరీలను సందర్శించి, కాయల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పుత్తూరు ఉద్యానశాఖ అధికారి సౌజన్య, వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.